సాక్షి అనంతపురం

గురువారం । 28 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 5.01



న్యూస్‌రీల్

చెక్ పోస్టుల్లో పటిష్ట నిఘా



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

విడపనకల్లు: సరిహద్దు చెక్ పోస్టుల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య తెలిపారు. మండలంలో కర్ణాటక సరిహద్దులోని డొనేకల్లు, విడపనకల్లు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టులను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందితో కలసి వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనం తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోకి కర్ణాటక మద్యం రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత నేరస్తులపై కూడా నిఘా ఉంచాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు గుంతకల్లు, గుత్తి, కణేకల్లు చెక్ పోస్టులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం.శ్రీరాం, సెబ్ అధికారులు పాల్గొన్నారు.

దాడులు విస్తృతం చేయండి

అనంతపురం: మద్యం అక్రమ రవాణా, నాటు సారా తయారీ, బెల్టుషాపుల నిర్వాహకులపై దాడులు విస్తృతం చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ (నేర విభాగం) పి. నాగ మద్దయ్య అన్నారు. అనంతపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వారిపై నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వి. ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

‘నగదు సీజ్’ ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీ

- హెల్ప్ లైన్ నంబర్ కూడా ఏర్పాటు



అనంతపురం అర్బన్: నగదు సీజ్ విషయంలో అందే సమస్యల పరిష్కారానికి జిల్లా గ్రీవెన్స్ కమిటీని నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆధారాల్లేకుండా రూ.50 వేలు మించి ఎవరూ తీసుకెళ్లకూడదని, అలా తీసుకెళితే నగదు సీజ్ చేసి, ఆ మొత్తానికి రసీదు ఇస్తారన్నారు. ఈ క్రమంలోనే అందే ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ‘జిల్లా గ్రీవెన్స్ కమిటీ’ ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీ సీఈఓ ఆధ్వర్యంలోని ఈ కమిటీకి నోడల్ అధికారి, కన్వీనర్‌గా జిల్లా సహకార అధికారి, మెంబర్‌గా జిల్లా ఖజానా శాఖ అధికారి ఉంటారని తెలిపారు. అలాగే, సమస్యల పరిష్కారానికి సంబంధించిన సమాచారం కోసం హెల్ప్ డెస్క్ 08554-220009 ఏర్పాటు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08554-232922 లేదా కన్వీనర్ 9100109211 నంబర్‌నూ సంప్రదించవచ్చన్నారు. ప్రజలు కూడా ఎన్నికల కమిషన్ నియమాలను పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ సూచించారు.

సీటు పాట్లు.. వేరుకుంపట్లు

- అనంతపురంలో రెండుగా విడిపోయిన టీడీపీ



అనంతపురం క్రైం: అనంతపురం అర్బన్‌లో టీడీపీ రెండుగా విడిపోయింది. సీటు కోసం రెండు వర్గాలు పడరాని పాట్లు పడుతున్నాయి. తనకు టికెట్ ఖరారు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి తన వర్గంతో బుధవారం రాయల్ ఫంక్షన్ హాలులో సమావేశం ఏర్పాటు చేస్తే.. ఆయనకు పోటీగా ఆ పార్టీ నేత జకీవుల్లా తన వర్గంతో మరో చోట సమావేశం నిర్వహించారు. సర్వే పేరుతో చంద్రబాబు ఎటూ తేల్చకపోవడం, ఈ క్రమంలోనే తమకు టికెట్ అంటే తమకంటూ ఎవరికి వారు వేరు కుంపట్లు పెట్టుకోవడంతో ఎవరి వెంట నడవాలో తెలియక కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు కుమిలిపోతున్నారు. మరోవైపు, జిల్లా కేంద్రంలో 40 ఏళ్లుగా గుత్తాధిపత్యం సాగిస్తున్న నేతలకే వంత పాడుతూ అలసి పోయామని పార్టీలోని మైనార్టీ, బలిజ సామాజిక వర్గాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



అభాగ్యులకు ఆరోగ్య సిరులు



గత నాలుగున్నరేళ్లలో జిల్లాలో ఆరోగ్య శ్రీ అమలు ఇలా..

ఆరోగ్య శ్రీ లబ్ధిదారులు	2,53,466
ప్రభుత్వ వ్యయం	రూ.542.12 కోట్లు
‘ఆరోగ్య ఆసరా’ లబ్ధిదారులు	1,19,119
అందిన ‘ఆసరా’ సాయం	రూ.61.058 కోట్లు

‘ఆరోగ్య శ్రీ’తో కొండంత భరోసా

- నాలుగున్నరేళ్లలో 2.53 లక్షల మందికి ఫైగా ఉచిత కార్పొరేట్ వైద్యం
- రూ.542 కోట్లకు ఫైగా వ్యయం
- నగటున జిల్లాలో ఏడాదికి రూ.140 కోట్ల ఖర్చు
- చికిత్సల సంఖ్య పెంచి పేదలకు మరింత భరోసా ఇచ్చిన సర్కారు



ఈమె పేరు బుడ్డప్పగారి పుట్టీరమ్మ. శెట్టూరు మండలం ములకలేడు గ్రామం. ఛాతీలో నొప్పి రావడంతో ఇటీవల కళ్యాణదుర్గంలోని ఓ ఆస్పత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు గుండె సమస్య ఉందని చెప్పారు. ఆపరేషన్ చేయించుకోవాలన్నారు. ఒక్కసారిగా పిడుగులాంటి వార్త విన్న పుట్టీరమ్మ హతాశురాలైంది. బాధాతప్త హృదయంతో ఇంటికి చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వలంటీర్.. ఆమె వద్దకు వెళ్లి భరోసా కల్పించారు. ‘ఆరోగ్య శ్రీ’ పథకం గురించి వివరించి, అనంతపురంలోని ఆస్పత్రికి వెళ్లమని సూచించారు. అక్కడికెళ్లాక ప్రభుత్వానికి ఆరోగ్య మిత్ర దరఖాస్తు చేయగా.. రూ.1,18,881 విడుదలైంది. ఉచితంగా ఆపరేషన్ కావడంతో పుట్టీరమ్మ సంతోషంగా ఇంటికి చేరుకుంది. ప్రభుత్వ మేలును మరిచిపోలేనని ఆమె చెబుతోంది.



ఇతని పేరు మారెన్న. గార్లదిన్నె మండలం బూదేడు గ్రామం. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్ల క్రితం మారెన్నకు గొంతు కింద గడ్డలు లేచాయి. అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లగా.. పరీక్షించిన వైద్యులు క్యాన్సర్ గడ్డ అని నిర్ధారించారు. ప్రైవేటుగా వైద్యం చేయించుకుంటే దాదాపు రూ.3 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఈ క్రమంలోనే ఆరోగ్య శ్రీ గురించి తెలుసుకున్న మారెన్న.. నగరంలోని ప్రజ్ఞ క్యాన్సర్ కేర్ ఆస్పత్రిలో చేరగా.. వారు ఆరోగ్య శ్రీ కింద చికిత్స ప్రారంభించారు. దాదాపు రెండు నెలల పాటు నిత్యం కీమోథెరపీ, రేడియోథెరపీ చేయడంతో మారెన్న కోలుకున్నాడు. ఇంటికి చేరాక కూడా ‘వైఎస్సార్ ఆసరా’ కింద ప్రభుత్వం ఆయన ఖాతాలో రూ.7 వేలు జమ చేసింది. పుట్టీరమ్మ, మారెన్నలే కాదు..గత నాలుగున్నరేళ్లలో జిల్లాలో 2.53 లక్షల మందికి ఆరోగ్య శ్రీ కింద ఉచిత వైద్యం అందింది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కుటుంబంలో ఎవరైనా ఒక వ్యక్తి రోగం బారిన పడితే ఆ ఇంట్లోని సభ్యులు పడే బాధ అంతా ఇంతా కాదు. ఆస్పత్రికి తీసుకెళ్లాక ఆపరేషన్ చేయాలని తెలిస్తే పడే ఆందోళన వర్ణనాతీతమే. అయితే, బాధలో కూరుకుపోయిన అలాంటి ఎంతో మందికి ఆరోగ్య శ్రీ ద్వారా తానున్నానంటూ కొండంత భరోసా కల్పించారు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. నిస్సహాయులకు అండగా నిలబడాలని నిత్యం చెప్పే ఆయన.. ఆచరణలోనూ చేసి చూపారు. టీడీపీ హయాంలో నిర్వీర్యమైన పథకానికి తానొచ్చాక ఊపిరిలూదారు.ఎందరికో పునర్జన్మ ప్రసాదించి ఆ పేదల ఇళ్లలో వెలుగులు నింపారు.

నాలుగున్నరేళ్లలో రూ.600 కోట్లకు పైగా వ్యయం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 2007లో ఆరోగ్యశ్రీ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టినప్పుడు అందుకు కేటాయించిన బడ్జెట్ రూ.925 కోట్లు. ఆ తర్వాత నెమ్మదిగా పెరిగింది. నేడు ఏకంగా, ఒక్క అనంతపురం జిల్లాలోనే అది కూడా ఏడాదిలోనే రూ.150 కోట్లకు పైగా వ్యయం చేసే స్థాయికి చేరిందంటే పేదల ఆరోగ్య రక్షణ కోసం వైఎస్ జగన్ ఎంతలా పాడుపడ్డారో అర్థం చేసుకోవచ్చు. గత నాలుగున్నరేళ్లలో ఆరోగ్యశ్రీతో పాటు ఆసరా కింద జిల్లాలో రూ.600 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం.

ఆపరేషన్ తర్వాతా భరోసా..

ఆపరేషన్ చేయించుకున్నాక కొన్ని రోజులైనా విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. కుటుంబ పెద్ద లేదా కుటుంబంలో కీలక వ్యక్తి సంపాదన ఆగిపోతే ఇల్లు గడవడం కష్టంగా మారుతుంది. అయితే, అలాంటి సమయంలోనూ ఆ కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించింది. రోజుకు రూ.225 లెక్కన గరిష్టంగా నెలకు రూ.5 వేలు ఇచ్చేలా చర్యలు తీసుకుంది. అలా గత నాలుగున్నరేళ్లలోనే 1.19 లక్షల మందికి రూ.61 కోట్లు అందించింది. లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా సొమ్ము జమ చేసింది.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
అనంతపురం అర్బన్	68.908	114.515
శింగనమల	60.459	92.92
తాడిపత్రి	48.961	82.06
గుంతకల్లు	49.940	78.44
ఉరవకొండ	39.742	66.844
రాయదుర్గం	31.874	55.40
కళ్యాణదుర్గం	33.473	60.61
రాప్తాడు	39.228	52.389

ప్రాణం పోశారు



2007లో ఛాతీలో నొప్పి రావడంతో హైదరాబాద్ వెళ్లా. కిమ్స్ ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ కింద బైపాస్ సర్జరీ చేయించుకున్నా. 12 ఏళ్ల పాటు ఆరోగ్యం బాగుండింది. తిరిగి 2019, 2024లో సమస్య తలెత్తడంతో హైదరాబాద్, కర్నూలులోని ఆసుపత్రులకు వెళ్లి, రెండు సార్లు స్టంట్లు వేయించుకున్నా. ప్రస్తుతం ఆరోగ్యం చాలా బాగుంది. దివంగత నేత వైఎస్సార్ మొదట ప్రాణాలు కాపాడితే, ఆయన తనయుడు జగన్ మోహన్ రెడ్డి రెండు సార్లు ప్రాణం పోశారు. జీవితాంతం వారికి రుణపడి ఉంటా.

– గురు పాద స్వామి, జ్యోతిష్యుడు, గుత్తి

ఉచితంగా రూ.3 లక్షల ఆపరేషన్



నేను, నా భర్త మల్లికార్జున వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటూ కుమార్తె, ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నాం. 4 నెలల క్రితం నాకు తీవ్రమైన మూత్ర నాళ సమస్య తలెత్తింది. ఆస్పత్రికి వెళ్తే వైద్యులు పరీక్షించి, ఆపరేషన్ చేయాలన్నారు. రూ. 3 లక్షలు ఖర్చయ్యే చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చేస్తామన్నారు. అనంతపురం కిమ్స్–సవేరా హాస్పిటల్‌లో ఆపరేషన్ జరిగింది. ఇప్పుడు ఆరోగ్యం చాలా బాగుంది.

– నక్కా రత్న, దేవరపల్లి గ్రామం, పామిడి మండలం

ప్రాణాలు కాపాడారు..



దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం నా ప్రాణాలను కాపాడింది. నాకు చిన్న వయసులోనే గుండె జబ్బు రావటంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. కుటుంబసభ్యులు హైదరాబాద్ తీసుకొని వెళ్లి గుండె ఆపరేషన్ చేయించారు. తర్వాత ఆరోగ్యం కుదుటపడటంతో ఉన్నత విద్యను అభ్యసించగలిగా.

– కె. వెంకటేష్, మామిళ్లపల్లి గ్రామం, కనగానపల్లి మండలం



అనంతపురంలో ప్రచారం నిర్వహిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి



కనగానపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న హిందూపురం పార్లమెంటు, రాప్తాడు అసెంబ్లీ అభ్యర్థులు శాంతమ్మ, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ప్రజాబలం తోడు.. ప్రచార జోరు

జిల్లాలో ఎన్నికల కోలాహలం నెలకొంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కదన రంగంలో వేగం పెంచారు. గత నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ, ప్రజా బలమే తోడుగా దూసుకుపోతున్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేసుకుని, మరింతగా లబ్ధి పొందాలంటూ పిలుపునిస్తున్నారు. ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ ఫలాలను చేర్చిన నేపథ్యంలో ప్రజలు వారికి బ్రహ్మ రథం పడుతున్నారు. - సాక్షి బృందం

ఎన్నికల బడ్జెట్ రూ.9.75 కోట్ల విడుదల

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి మొదటి విడతగా జిల్లాకు రూ.9,75,93,300 బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల కార్యకలాపాలు నిర్వహించేందుకు దశలవారీగా నిధులను నియోజకవర్గాల ఆర్‌ఓలకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అందజేస్తుంది. ఈ క్రమంలో తొలిదశగా నియోజకవర్గాలకు రూ.2,92,76,000 నిధులను జిల్లా ఎన్నికల యంత్రాంగం మంజూరు చేసింది.

ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వర్తించాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్కోర్ యాప్‌పై పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రచారం, సమావేశాలు, వాహన, లౌడ్ స్పీకర్ తదితర వాటికి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్కోర్ యాప్ దరఖాస్తులకు గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. హోమ్ ఓటింగ్ (ఇంటి నుంచే ఓటు)కు సంబంధించి మంచానికి పరిమితమైన వారు, 85 ఏళ్ల వయసు దాటిన వారు, పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని దివ్యాంగుల ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. దీనిపై బృందాలను ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 4 నుంచి 9 లోగా వారికి 12–డీ ఫారం ఇవ్వాలన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఏప్రిల్ 15 లోపు ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణిసుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, కరుణకుమారి, వెన్నెల శ్రీను, నోడల్ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, డీపీఓ రవిశంకర్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

ఫిర్యాదులు పరిష్కరిస్తున్నాం

‘సీ–విజిల్’ యాప్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. సీఈఓ బుధవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26 వరకూ 191 ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నిటినీ పరిష్కరించామని చెప్పారు.

అనుమతులు తప్పనిసరి..

ఎన్నికల కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రచారం, సమావేశాలు, వాహనాలు, లౌడ్‌స్పీకర్లు, తదితర వాటికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ‘పది’ పరీక్షలు

- 1 నుంచి మూల్యాంకనం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. దీంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం సోషల్ పరీక్ష 142 కేంద్రాల్లో జరిగింది. 2,203 మంది గైర్హాజరయ్యారు. 31,330 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 31,018 మంది హాజరయ్యారు. అలాగే 2,538 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 647 మంది హాజరయ్యారు. చివరి రోజు విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష ముగిసిన అనంతరం ఆనందంతో కేకలు వేశారు.

1 నుంచి మూల్యాంకనం

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. 8 వరకూ సాగనుంది. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్ జవాబు పత్రాలు రాగా, వాటిని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

విద్యార్థుల భవిష్యత్తుకు ముడిపడిన అంశం కావడంతో మూల్యాంకనం పకడ్బందీగా జరిగేలా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 58 ఏళ్లకు పైబడిన టీచర్లకు విధుల నుంచి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆ వయసు టీచర్లలో ఎవరైనా ఆసక్తి ఉంటే విధులకు తీసుకుంటారు. ఇప్పటికే అన్ని సబ్జెక్టుల టీచర్ల సీనియార్టీ జాబితాను డీఈఓ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు.

డీఈఓ క్యాంపు ఆఫీసర్‌గా...

జిల్లా విద్యాశాఖ అధికారి స్పాట్ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఆమె పరిధిలో ఇద్దరు డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లు ఉంటారు. వారి కింద 8 మంది అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు ఉండనుండగా, వారికింద దాదాపు 250 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 650 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లు ఉంటారు.



జవాబు పత్రాల స్పాట్ కేంద్రం

ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లు కీలకం..

జవాబుపత్రాలు దిద్దే విషయంలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ), స్పెషల్ అసిస్టెంట్ల పాత్ర కీలకం. మూల్యాంకనం తర్వాత వచ్చిన మార్కులు టోటలింగ్ చేయడం, మార్కుల పోస్టింగులు పరిశీలించడం శ్రద్ధగా చేయాల్సి ఉంటుంది. ఏఈలు పేపర్లు దిద్ది మార్కులు వేసిన తర్వాత స్పెషల్ అసిస్టెంట్లు జవాబు పత్రం తీసుకుని మార్కుల పోస్టింగులు, టోటలింగ్ పరిశీలించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఏఈలు జవాబు పత్రాలు దిద్దుతున్న కంగారులో మార్కుల టోటలింగ్‌లో తప్పులు జరిగే అవకాశం ఉంటుంది. ఏఈలు దిద్దిన జవాబు పత్రాలను స్పెషల్ అసిస్టెంట్లు మరోసారి పరిశీలించి మార్కుల వివరాలను ధ్రువీకరిస్తారు. పొరబాటున ఏఈల చేతుల్లో టోటలింగ్‌లో తక్కువ వచ్చిన అంశాల్ని స్పెషల్ అసిస్టెంట్లు గుర్తించిన సందర్భాలు అనేకం. సీఈలు కూడా ర్యాండమ్‌గా కనీసం మూడు జవాబుపత్రాలు పరిశీలిస్తారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న అడవి పంది

- ముగ్గురికి తీవ్రగాయాలు





గాయపడిన వెంగన్నపల్లి ప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

పెద్దవడుగూరు: ఓ అడవి పంది ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. యాడికి మండలం వెంగన్నపల్లికి చెందిన ప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పెద్దవడుగూరు మండలం కడదరగుట్టపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డిలు బుధవారం ద్విచక్ర వాహనంపై పెద్దవడుగూరులో బంధువుల ఇంట్లో జరుగుతున్న వివాహానికి బయలుదేరారు. మార్గమధ్యంలో లక్ష్ముంపల్లి వద్ద వ్యవసాయ పొలాల్లోంచి పరుగెత్తుకుంటూ వచ్చిన ఓ అడవి పంది ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో బైకు అదుపుతప్పి బోల్తా పడడంతో ముగ్గురికీ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ఆటోలో పెద్దవడుగూరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లినట్లు తెలిసింది. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.



మోహినీ అవతారంలో శ్రీవారు

మోహినీరూపాయ.. ఖాద్రీశా

కదిరి: ఖాద్రీశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన బుధవారం స్వామివారు మోహినీ రూపంలో దర్శనమిచ్చారు. వయ్యారాలు ఒలకబోసే సోయగాలతో, చంకన అమృత భాండాగారాన్ని పెట్టుకొని సుకుమార వేషంలో కనిపించిన వసంతవల్లభుడిని చూసి భక్తజనం తన్మయత్వం చెందారు. ధగధగా మెరిసే పట్టు చీరలో గుభాళించే కదిరి మల్లెల అలంకరణలో ఉన్న ఖాద్రీశున్ని చూసేందుకు రెండు కళ్లూ సరిపోలేదు. శ్రీవారికి అలంకరించిన కుచ్చుల వాలు జడ ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పాల కడలిని మదించి అందులో ఉద్భవించిన అమృతాన్ని సేవించడానికి దేవతాసురులు పోటీ పడగా, అమృతాన్ని పంచడానికి శ్రీమహావిష్ణువు మోహినీ అవతారమెత్తారని భక్తుల విశ్వాసం. మోహినీ అవతార సేవ ఉభయదారులుగా పట్టణానికి చెందిన కోటా వెంకట సుబ్బయ్య శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

క్లుప్తంగా

భర్త వేధింపులు... బాలింత ఆత్మహత్య


మృతురాలు ప్రియాంక

గుంతకల్లు రూరల్: భర్త వేధింపులు తాళలేక ఓ బాలింత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన నాగలక్ష్మి, హనుమంతు దంపతుల కుమార్తె ప్రియాంక(28)ను ఐదేళ్ల క్రితం గుంతకల్లులోని సత్యనారాయణపేటలో నివాసముంటున్న సతీష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. హోటల్ నిర్వహిస్తూ సతీష్ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారిన సతీష్ ఉన్న హోటల్‌ను కూడా మూత వేసి జులాయిగా మారాడు. రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్యను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. ఈ క్రమంలో గర్భం దాల్చిన ప్రియాంక కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. ఐదు నెలల క్రితం పండంటి మగబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. ప్రస్తుతం పుట్టింట్లోనే ఉంటున్న ప్రియాంకను ఏదో ఒక మిషతో అనరాని మాటలు అంటూ భర్త వేధిస్తూ వచ్చాడు. అతని ప్రవర్తనతో పూర్తిగా విసుగు చెందిన ప్రియాంక బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గుంగకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన తలనీలాల వేలం


బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో తలనీలాల ఆదాయ వనరుపై చేపట్టిన వేలం ప్రక్రియ బుధవారం ముగిసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకూ భక్తుల తలనీలాలు పోటు చేసుకునే అంశానికి అనుమతులు మంజూరు చేసేందుకు ఆలయ అధికారులు ఇప్పటికి నాలుగు సార్లు వేలం నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయ ముఖమంటపంలో ఈఓ భద్రాజీ, ఆలయ ధర్మకర్త సుగుణమ్మ సమక్షంలో అధికారులు వేలం ప్రక్రియ నిర్వహించారు. రూ.1,23,03,000కు వేలం పాడి శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన రాజు ఎంటర్‌ప్రైజెస్ వారు తలనీలాల సేకరణ హక్కు దక్కించుకున్నారు. అనంతరం స్టేషనరీ సరఫరాకు సంబంధించి టెండర్లను నిర్వహించారు.

విత్తన కష్టాలకు.. ఉన్న ఊరిలోనే చెక్



- బాబు జమానాలో అన్నదాతకు చెప్పనలవిగా విత్తన కష్టాలు
- నేడు గ్రామంలోనే ఆర్‌బీకేలో సాఫీగా విత్తనం

టీడీపీ హయాంలో ప్రత్యామ్నాయ విత్తనం కోసం డీసీఎంఎస్ కార్యాలయం వద్ద ఎండలోనే బారులు తీరిన రైతులు వీరు. ఇదొక్క ఫొటో చాలు చంద్రబాబు హయాంలో అన్నదాతలు ఎన్ని కష్టాలు పడ్డారో చెప్పడానికి. అప్పట్లో విత్తనాలు కావాలంటే రోజుల తరబడి శ్రమించాల్సిన దుస్థితి. మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసే పంపిణీ కేంద్రాలకు రెండు మూడు రోజులు తిరిగితే కానీ విత్తనాలు దక్కేవి కాదు. అది కూడా ఇంటిల్లిపాదీ వెళ్లాల్సిన పరిస్థితి. కొందరు రైతులు రాత్రిళ్లు, తెల్లవారు జామునే పంపిణీ కేంద్రాలకు చేరుకుని క్యూలలో తమ వంతుగా చెప్పులు పెట్టి అక్కడే పడుకునే వారు కూడా. చార్జీలు, రవాణా, భోజన ఖర్చులు, ఇతరత్రా శ్రమ అంతాఇంతా కాదు. ఒక్కోసారి పోలీసులతో తన్నులు కూడా తినాల్సి వచ్చేది. నాడు విత్తనాల కోసం రైతుల చేసిన పోరాటం గురించి ఎంత చెప్పినా తక్కువే. – అనంతపురం అగ్రికల్చర్:



ఇది గత ఏడాది గార్లదిన్నె మండలంలోని ఓ గ్రామంలో స్థానికంగా ఉండే ఆర్‌బీకే వేదికగా రైతులకు విత్తన పంపిణీ చేస్తున్న దృశ్యం. 2019 మేలో సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరిగ్గా ఏడాది పూర్తయిన సందర్భంగా 2020 మే 30న గ్రామ గ్రామాన అన్నదాతల కోసం రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) ఏర్పాటు చేశారు. రైతులు గ్రామం దాటి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆర్‌బీకేల్లోనే విత్తనం, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందించేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో రైతుల ఖర్చులు, శ్రమ బాగా తగ్గిపోయాయి. అనుకున్నదే తడవుగా విత్తనం, ఎరువులు తీసుకుంటూ సాఫీగా సేద్యం పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం రాయితీ కిందే కాకుండా నాన్‌సబ్సిడీ కింద కూడా విత్తనాలు ఇస్తున్నారు. నూతన వ్యవసాయ విప్లవానికి నాంది పలకడంతో అన్నదాత ఇంట హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

ఇకపై క్లెయిమ్‌ల విచారణ వద్దు

- స్పష్టమైన ఆదేశాలిచ్చిన ఎన్నికల కమిషన్

అనతపురం అర్బన్: ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం-7 (ఓట్ల తొలగింపు), ఫారం-8 (వివరాల మార్పు) దరఖాస్తుల విచారణ ప్రక్రియకు ఎన్నికల కమిషన్ ముగింపునిచ్చింది. గత ఏడాది డిసెంబర్ 10 నుంచి ఈ నెల 16వ తేదీ వరకూ వచ్చిన ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఇక నుంచి చేపట్టరాదని జిల్లా యంత్రాగానికి స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే ఫారం-7, ఫారం-8 క్లయిమ్‌ల సమర్పణ అనేది నిరంతర ప్రక్రియ. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో సమర్పించవచ్చు. అయితే వీటి పరిశీలన, విచారణ ప్రక్రియ ఎన్నికల తర్వాత చేపడతారు. నిర్దేశించిన వ్యవధిలో వచ్చిన ఫారం-7 క్లయిమ్‌లు 99.89 శాతం, ఫారం-8 క్లయిమ్‌లు 99.91 శాతం పరిష్కారం అయ్యాయి. సాంకేతిక సమస్యల(టెక్నికల్ ఎర్రర్) కారణంగా ఫారం-7 దరఖాస్తులు 0.11 శాతం, ఫారం-8 దరఖాస్తులు 0.09 పరిష్కారం కాలేదని అధికారవర్గాలు వెల్లడించాయి.

ఫారం-7 పరిష్కారం ఇలా..

ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో గత ఏడాది డిసెంబరు 10వ తేదీ నుంచి ఈనెల 16వ తేదీ వరకు ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫారం-7 దరఖాస్తులు 45,441 వచ్చాయి. వీటిలో 38,099 దరఖాస్తులు పరిష్కారం కాగా, 7,293 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. సాంకేతిక సమస్య కారణంగా 49 (0.11శాతం) దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఫారం-8 పరిష్కారం ఇలా...

ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో గత ఏడాది డిసెంబరు 10వ తేదీ నుంచి ఈనెల 16వ తేదీ వరకు ఓటరు జాబితాలో ఓటరు వివరాల మార్పునకు సంబంధించి ఫారం-8 దరఖాస్తులు 39,150 వచ్చాయి. వీటిలో 35,364 దరఖాస్తులు పరిష్కారం కాగా, 3,749 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. సాంకేతిక సమస్య కారణంగా 37 (0.09శాతం) దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఓటరుగా నమోదుకు అవకాశం..

కొత్త ఓటరుగా నమోదయ్యేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ముగిసే ఏప్రిల్ 25వ తేదీ వరకు ఓటరుగా నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అప్పటి వరకూ అందిన దరఖాస్తులను పరిశీలించి ఓటరుగా నమోదు చేయడంతో పాటు ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. తుది ఓటరు జాబితాకు కొత్తగా నమోదైన ఓటర్లకు సంబంధించి అనుబంధ జాబితాను జత చేస్తారు.


క్లెయిమ్‌ల విచారణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి (ఫైల్)

గత డిసెంబర్ 10 నుంచి ఈ నెల 16 వరకు అందిన క్లెయిమ్‌ల పరిష్కారం ఇలా..

ఫారం-7 (ఓట్ల తొలగింపు)	
అందిన దరఖాస్తులు	: 45,441
తిరస్కరించిన దరఖాస్తులు	: 7,293
ఆమోదించిన దరఖాస్తులు	: 38,099
టెక్నికల్ ఎర్రర్‌తో పెండింగ్	: 49
ఫారం-8 (వివరాల మార్పు)	
అందిన దరఖాస్తులు	: 39,150
తిరస్కరించిన దరఖాస్తులు	: 3,749
ఆమోదించిన దరఖాస్తులు	: 35,364
టెక్నికల్ ఎర్రర్‌తో పెండింగ్	: 37

నియోజకవర్గాల వారీగా ఫారం- 7 పరిష్కారం ఇలా

నియోజవర్గం	దరఖాస్తులు	తిరస్కరణ	పరిష్కారం	టెక్నికల్ ఎర్రర్ వల్ల పెండింగ్
రాయదుర్గం	2,799	393	2,397	9
ఉరవకొండ	5,714	610	5,103	1
గుంతకల్లు	5,357	589	4,761	7
తాడిపత్రి	5,227	589	4,633	5
శింగనమల	5,810	328	5,478	4
అనంతపురం	9,784	995	8,767	22
కళ్యాణదుర్గం	5,425	1,807	3,617	1
రాప్తాడు	5,325	1,982	3,343	0
మొత్తం	45,441	7,293	38,099	49

నియోజకవర్గాల వారీగా ఫారం-8 పరిష్కారం ఇలా

నియోజవర్గం	దరఖాస్తులు	తిరస్కరణ	పరిష్కారం	టెక్నికల్ ఎర్రర్ వల్ల పెండింగ్
రాయదుర్గం	3,668	199	3,450	19
ఉరవకొండ	5,722	374	5,348	0
గుంతకల్లు	6,483	396	6,074	13
తాడిపత్రి	4,178	734	3,444	0
శింగనమల	4,917	272	4,641	4
అనంతపురం	7,517	1,025	6,492	0
కళ్యాణదుర్గం	2,518	173	2,345	0
రాప్తాడు	4,147	576	3,570	1
మొత్తం	39,150	3,749	35,364	37

వైఎస్సార్‌సీపీలోకి ప్రబోధానంద భక్తులు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి (చిత్రంలో) రమేష్‌గౌడ్ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రబోధానంద స్వామి భక్తులు బుధవారం అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సమక్షంలో ఆయన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ ఇన్‌చార్జ్ రఘు, తదితరులకు ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని యువతకు పిలుపునిచ్చారు. రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చొరవతో నియోజకవర్గంలో రూ.1,045 కోట్లతో జరిగిన అభివృద్ధి పనులు జిల్లాకే తలమానికంగా నిలిచాయని కొనియాడారు. జగనన్న సంక్షేమ పాలన, రాష్ట్రాభివృద్ధిని గుర్తించి పెద్ద ఎత్తున యువత పార్టీలోకి చేరుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దాదాపు 200 మందికి పైగా ఎమ్మార్పీఎస్, ప్రబోధానంద స్వామి శిష్యులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దన్న, బాలచంద్ర, బుగ్గ దేవేంద్ర, కె.హరిబాబు, లక్ష్మీదేవి, పెద్దక్క, శివ, లావణ్య, జయమ్మ, ప్రబోధానంద శిష్య బృందంలో సూర్యనారాయణరెడ్డి, సుంకిరెడ్డి, వెంకట్రాముడు, రామిరెడ్డి, ఓబులేసు, నల్లప్ప, దాము ఉన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కార్పొరేటర్ సాకే చంద్రలేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే కుళ్లాయిస్వామి, తబ్రేజ్, ఇద్దూ, బెస్త వెంకటేష్, నరేంద్ర, పోతులయ్య, నాగేంద్ర, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

అంజలి మృతి కేసులో వీడిన మిస్టరీ

- ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని మోసం
- బేల్దారులు దస్తగిరి, బాలుతోపాటు అంజలి భర్త రాజు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

అనంతపురం: నగరంలో రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న అంజలి మృతి వెనుక మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆర్థిక పరిస్థితులను ఆసరా చేసుకుని ఆమె జీవితంతో చెలగాటమాడి మృతికి కారణమైన ముగ్గురిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఇద్దరు బేల్దారులతో పాటు అంజలి భర్త కూడా ఉండడం గమనార్హం. బుధవారం అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ వీరరాఘవరెడ్డి వెల్లడించారు. అనంతపురంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం అంజలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనారోగ్యంతో మృతి చెందినట్లుగా భావించి ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆమె మృతదేహాన్ని ఖననం చేయించారు. అయితే అంజలి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆ దిశగా దర్యాప్తు వేగవంతం చేశారు.

అంజలి శరీరంపై గాయాలు..

బుధవారం ఉదయం జేఎన్‌టీయూఏ రోడ్డులోని హిందూశ్మశాన వాటికకు పోలీసులు చేరుకుని ఖననం చేసిన అంజలి మృతదేహాన్ని వెలికి తీయించి అనంతపురం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ డి.శివరామిరెడ్డి సమక్షంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేయించారు. కీలక భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అయితే ఆమెది సహజ మరణం కాదని ప్రాథమికంగా వైద్యులు నిర్ధారించారు. అంజలి శరీరంపై గాయాలు ఉండడం, ఉదర భాగంలో తీవ్ర గాయాన్ని గుర్తించారు. కాగా, అంజలికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీరిని బాల సదనంలో చేర్పించారు. వీరిలో ఓ కుమారుడు దొంగతనాల కేసులో నిందితుడని తెలిసింది.

ఆటోలో పిలుచుకెళ్లిన బేల్దారులు..

అంజలి మృతిపై విభిన్న కథనాలు వెలువడడంతో కేసు దర్యాప్తును ఎస్పీ అన్బురాజన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ వీరరాఘవరెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన సీఐ రెడ్డప్ప... ఐసీడీఎస్ అధికారులతో కలసి అంజలి అత్త తులసమ్మ, ఆమె ముగ్గురు పిల్లలను విచారించారు. ఈ నెల 23న ఉదయం అంజలిని ఆమె ఇంటి నుంచి బేల్దారులు బాలు, దస్తగిరి ఆటోలో పిలుచుకెళ్లారు. కొన్ని గంటల తర్వాత ఇంటి వద్ద వదిలారు. విషయం తెలుసుకున్న భర్త రాజు అదే రోజు రాత్రి ఆమెను నిలదీశాడు. ఎక్కడెక్కడో తిరుగుతూ పిల్లల బాగోగులు పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డాడు. ఆ సమయంలో అంజలి అదే స్థాయిలో తిరగబడింది. మద్యానికి బానిసగా మారి ఇంటి గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా తిరుగుతున్నావంటూ భర్తను నిలదీసింది. కూలీ డబ్బులు వస్తే కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందనే బేల్దారులతో కలసి వెళ్లానంటూ సమాధానమిచ్చింది. ఆ సమయంలో ఆమెను భర్త చితకబాదాడు. కుటుంబసభ్యులు వాంగ్మూలం ఆధారంగా దస్తగిరి, బాలును పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. అంజలి ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని ఆమెను శారీరకంగా ఇద్దరూ లోబరుచుకున్నట్లుగా వెల్లడైంది. దీంతో ఇద్దరితో పాటు అంజలిని కొట్టి ఆమె మృతికి కారణమైన భర్త రాజును సైతం పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.



నలుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన నలుగురు కాంట్రాక్టు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో తాడిపత్రి పట్టణంలోని రిటైల్ అవుట్‌లెట్ కాంట్రాక్టు ఉద్యోగి జి.విజయకుమార్, మునిసిపల్ ఎన్ఎంఆర్ ఉద్యోగులు జె.సి.సూర్యనారాయణరెడ్డి, ఎస్.తిరుపాల్‌రెడ్డి, శింగనమల మండల వెస్ట్ నరసాపురం ఫీల్డ్‌అసిస్టెంట్ కె.అంజన్‌రెడ్డి ఉన్నారు. అలాగే సి-విజిల్ ద్వారా అందిన 11 ఫిర్యాదులను పరిష్కరించారు.

హంస వాహనంపై చెన్నకేశవుడి విహారం



యాడికి: బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ అర్చకుడు హరికృష్ణ శర్మ వేకువజాము నుంచే వసంతోత్సవం, ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. గాధం శెట్టి శ్యామలమ్మ , గాధం శెట్టి బలరామయ్య, లక్ష్మి ఆధ్వర్యంలో రాత్రి 10 గంటలకు హంస వాహన సేవ ప్రారంభమైంది. కెనరా బ్యాంకు, పాత పోలీస్‌స్టేషన్, కోమటి బజార్ మీదుగా వైభవంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటనాయుడు, నాగరాజు రామ్మోహన్, వార్డు సభ్యుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమానికి పెద్దపీట

- పూలే, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాధికారం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 5వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వాడుకుంది. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ బడుగుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 5వ డివిజన్‌లోని శ్రీనివాసనగర్, ఖాజానగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్ కార్యక్రమాన్ని చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా బడుగులకు రాజ్యాధికారం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. కేబినెట్‌లో 25 మందికి గానూ 11 మంది బీసీలకు, రాష్ట్ర వ్యాప్తంగా 84 మంది మునిసిపల్ చైర్మన్లు ఉంటే అందులో 44 మంది, 14 మేయర్ స్థానాల్లో 9 మంది, 13 జెడ్పీ చైర్మన్లలో ఆరుగురు, 44 మంది శాసన మండలి సభ్యుల్లో 30 మంది, 637 ఎంపీపీల్లో 237 మంది బీసీలకు అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం పదవిని ఓ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించారన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి రూ.22 వేల కోట్లు

వైఎస్సార్ ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించడంతో లక్షలాది మంది మైనార్టీల పిల్లలు ఉన్నత కొలవులు సాధించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా మైనార్టీలకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. టీడీపీ పాలనలో మైనార్టీలకు రూ.2,665 కోట్లు కేటాయిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.22 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు మైనార్టీలకు అది చేస్తాం.. ఇది చేస్తామని కాలం వెల్లదీశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 5600 మసీదుల్లోని మౌజెన్, ఇమామ్‌లకు వక్ఫ్‌బోర్డు ద్వారా గౌరవవేతనం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోనూ మైనార్టీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించామన్నారు. మేయర్ పీఠం జనరల్‌కు అయినా.. బడుగు, బలహీన వర్గాలకందించాలని ఆ అవకాశాన్ని మైనార్టీ సామాజిక వర్గానికి కేటాయించామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు జయలలిత, సాకే చంద్ర, బాలాంజినేయులు, కమల్‌భూషణ్, సుజాత, ఇసాక్, గూడురు మల్లికార్జున అనిల్‌కుమార్ రెడ్డి, సాకే చంద్రలేఖ, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామి రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, స్థానికులు పవన్ కుమార్‌రెడ్డి, రాజకుళ్లాయప్ప, హాజీ ఫకృద్దీన్, నగేష్, ప్రహల్లాద, అంకిరెడ్డి ప్రమీళ, యల్లమ్మ, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లా బేగ్, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, కొర్రపాడు హుస్సేన్ పీరా, కృష్ణవేణి, నాయకులు రామయ్య, అనిల్‌కుమార్ గౌడ్, కుళ్లాయస్వామి, మధు, కిషోర్, చెన్నారెడ్డి,అమర్‌నాథ్ రెడ్డి, జానీ, రామయ్య, తభారతి, ఉష, సుజాతరెడ్డి, జావెద్ పాల్గొన్నారు.

నియాజ్ సేవాభావం అభినందనీయం

అనంతపురం కల్చరల్: మాజీ మునిసిపల్ చైర్మన్ ఫకృద్దీన్ బాటలోనే ఆయన తనయుడు నియాజ్ కూడా సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం క్యాన్ పెట్రోల్ బంక్ అధినేత నియాజ్ ఆధ్వర్యంలో 1,000 మందికి రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. నియాజ్ జన్మదినం నాడు అందరికీ ఆనందం కల్గించే రంజాన్ తోఫా అందజేయడం శుభపరిణామన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లిం ప్రజలకు తోఫా అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, నదీం, కార్పొరేటర్లు రహంతుల్లా, అబుసాలెహ, సైఫుల్లాబేగ్, ఇసాక్, అనిల్‌కుమార్, వలి, అలీం తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

మళ్లీ వైఎస్ జగనే సీఎం



దాదులూరులో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి. చిత్రంలో హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ



మామిళ్లపల్లిలో జరిగిన ఎన్నికల బహిరంగ సభకు హాజరైన ప్రజలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ న్యాయం
- ఎన్నికల ప్రచారంలో రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ

కనగానపల్లి: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ తెలిపారు. మండలంలో బుధవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వారితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, తదితరులు పాల్గొన్నారు. ఉదయం పర్వతదేవరపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం దాదులూరు, కుర్లపల్లి, కుర్లపల్లి తండాల మీదుగా మామిళ్లపల్లి వరకూ రాత్రి 8 గంటల వరకూ సాగింది. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. సాయంత్రం మామిళ్లపల్లిలో జరిగిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి

రాప్తాడు నియోజకవర్గంలో పల్లెలు ఇలాగే ప్రశాంతంగా ఉండాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మామిళ్లపల్లిలో సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్ల పరిటాల కుటుంబ సభ్యుల పాలనలో సాగిన ఫ్యాక్షన్ రాజకీయాలతో ఈ ప్రాంతం హత్యలు, దోపిడీలతో అట్టుడికిపోయిందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ వచ్చిన తర్వాత ఎక్కడా ఫ్యాక్షన్ కక్షలు లేకుండా పల్లెల్లో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయించడంతో పాటు మహిళల జీవనోపాధికి పాల డెయిరీని ఏర్పాటు చేయించామన్నారు. రాప్తాడు నియోజకవర్గాన్ని ఫ్యాక్షన్‌కు దూరంగా అభివృద్ధి వైపు నడిపిస్తుంటే.. పరిటాల కుటుంబ సభ్యులు అసెంబ్లీ టిక్కెట్ కోసం జిల్లా అంతటా తిరిగి వచ్చి మళ్లీ రాప్తాడులోనే పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ గ్రామాల్లో భయాందోళనలు సృష్టించాలని చూస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బోయ శాంతమ్మ తెలిపారు. ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే జగనన్న సహకారంతో బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పార్లమెంట్‌లో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో హిందూపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఇంద్రజ, జిల్లా గొర్రెలు, మేకల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరసింహాగౌడ్, సీనియర్ నాయకురాలు గంగుల భానుమతి, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతి ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ, బూత్ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

కనగానపల్లి: మండలంలోని చంద్రాచ్చర్ల గ్రామానికి చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ గ్రామంలో పర్యటించారు. టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ రాయపాటి సాయిరాం, శ్రీరాములు, రాజగోపాల్, రాయపాటి మహేష్, కృష్ణయ్యతో పాటు వారి అనుచరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. గతంలో టీడీపీకి పట్టున్న ఈ గ్రామంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారే ఎక్కువ మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. పరిటాల సునీతకు గట్టి షాక్ తగిలిందని స్థానికులు చెబుతున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ మారుతి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, స్థానిక నాయకులు శివారెడ్డి, ఆది, నారాయణ స్వామి, మురళీ, సూరి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలు

క్లుప్తంగా

ఆస్పత్రికి ఫ్యాన్ల వితరణ



జీజీహెచ్ సూపరింటెండెంట్ కేఎస్ఎస్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు రమణారెడ్డి

అనంతపురం మెడికల్: వేసవి కాలంలో బాలింతలు ఇబ్బందులు పడకుండా రూ.40,000 విలువ చేసే 12 పెడెస్టల్ ఫ్యాన్లను ప్రభుత్వ సర్వజనాస్పత్రికి అందించి తమ ఔదార్యాన్ని చాటుకుంది అమ్మ సంస్థ. బుధవారం జీజీహెచ్ ఆవరణలో ఐడీ వార్డు షెడ్డులో ఉన్న బాలింతల సౌకర్యార్థం అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి ఫ్యాన్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీకి నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని ఎమ్మార్పీఎస్ క్రమశిక్షణ కమిటి చైర్మన్ బీసీఆర్ దాస్ ఆరోపించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. పేద ప్రజలకు అండగా ఉంటున్న ఆర్డీటీకి అండగా నిలవాలన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కోరారు.

ఉద్యోగాలకు 11 మంది ఎంపిక



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

రాప్తాడు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించాలన్న తపన విద్యార్థుల్లో ఉండాలని ఎస్‌వీఐటీ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వెన్నపూస రమాకాంత్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ కళాశాలలో బుధవారం బెంగళూరుకు చెందిన టాప్ అకాడమీ కంపెనీ ప్లేస్‌మెంట్ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. టాప్ అకాడమీ కంపెనీకి ఎంపికైన విద్యార్థులకు కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టాప్ అకాడమీ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం కళాశాలలో వెన్నపూస గణధర్ రెడ్డి, నిమేష్ రెడ్డిలు అన్‌లాకింగ్ యువర్ ఫ్యూచర్ అన్ ఎక్స్‌ప్లోరింగ్ కెరియర్స్ ఇన్ డేటా సైన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిన్సిపల్ విష్ణువర్ధన్, ఏఓ వి.వి.శివా రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబువి బూటకపు హామీలు'

రాప్తాడు: చంద్రబాబు బూటకపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ఫ్యాన్ గుర్తుకు మరోసారి ఓటు వేసి ఆశీర్వాదించాలని ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది కోరారు. బుధవారం మండలంలోని జి.కొత్తపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి పథకాల గురించి వివరించారు. గతంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ఒకటి కూడా సరిగా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని గుర్తు చేశారు. రైతులకు రుణమాఫీ, అక్క చెల్లెమ్మలకు డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం అని చెప్పి మోసం చేశారని తెలిపారు. టీడీపీ హయాంలో సీఫారసు ఉన్న వారికి మాత్రమే పథకాలు అందించారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో పేదలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. అధికారం కోసం మళ్లీ పొత్తులతో వస్తున్న చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, సర్పంచు చంద్రకళ, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, స్థానిక నాయకులు చిన్న క్రిష్టా రెడ్డి, డీలర్ ప్రసాద్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, వేమా రెడ్డి, తాతి రెడ్డి, భాస్కర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, మల్లి రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, లోకేశ్వర రెడ్డి, చెన్నారెడ్డి, సింగారప్ప, బుడగ నాగరాజు, గంగాధర్ రెడ్డి, గవ్వల నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



జి.కొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వేపచెర్ల, వేపచెర్ల ఎగువ తండా, వేపచెర్ల దిగువ తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. విద్య, వైద్యానికి కూడా ఎంతో మందికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చి రైతుల కళ్లలో ఆనందం చూశారన్నారు. ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, సర్పంచులు లక్ష్మీదేవి, కాంతమ్మ, ఎర్రిస్వామి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, ఎంపీటీసీలు వరలక్ష్మి, కృష్ణానాయక్, నాయకులు యల్లప్ప, రవి నాయక్, జగదీష్, ఆత్మకూరు ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, లక్ష్మీనారాయణ, రామచంద్రానాయక్, రమేష్, గోపాల్, మీఠానాయక్, వీరాంజనేయులు, అతిక్‌రెడ్డి, వెంకటేష్, శ్రీరామ్, నాగరాజు, వన్నూరప్ప, ముత్యాలరెడ్డి, అక్కులన్న, ఆదెప్ప, అశోక్, మల్లికార్జున, ఈశ్వరరెడ్డి, ఎర్రిస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వేపచెర్లలో ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీని గెలిపించాలి

రాప్తాడురూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గెలిస్తే పేదలు గెలిచినట్టేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. హిందూపురం ఎంపీ అభ్యర్థిని బోయ శాంతమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా బుధవారం అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బండి పవన్, యూత్ విభాగం మండల అధ్యక్షుడు కుమ్మరి శీనా, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, సావిత్రి శ్రీనివాసులు, గురుప్రసాద్, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు మారెప్ప, సోమశేఖర్‌రెడ్డి, సునీల్‌దత్తరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆనంద్, పెద్దిరెడ్డి, వైస్ సర్పంచ్ చాకలి నారాయణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఈశ్వరయ్య, చిరంజీవి, కృష్ణప్ప, అక్కులప్ప, పెద్దన్న, రమేష్, తిరుపాల్, ఈశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్, నాగేంద్ర, భరత్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

అనంతపురం క్రైం: ఆర్టీసీ డిపోమేనేజర్ కార్మికులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి గోపాల్, అధ్యక్షుడు భాస్కరరెడ్డి అన్నారు. వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జోనల్ ఉపాధ్యక్షుడు ఎస్.శివరామనాయక్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ డిపోమేనేజర్ నాగభూపాల్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో అధికారుల తప్పిదాలను ఎండగట్టాడన్న ఉద్దేశంతో డిపోమేనేజర్ కక్షగట్టి నాయక్‌ను విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఆరోగ్యం సరిగా లేదని ప్రభుత్వ వైద్యులు సిక్ సర్టిఫికెట్ ఇచ్చినా డిపో మేనేజర్ సర్టిఫికెట్‌ను పరిగణలోకి తీసుకోలేదన్నారు. విధులకు గైర్హాజరయ్యావని షోకాజ్ ఇచ్చి తొలగించారని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్యులు ఇచ్చే సర్టిఫికెట్‌ను పరిగణలోకి తీసుకుని వేతనం కూడా ఇవ్వాలని ఆర్టీసీ యాజమాన్యం సర్క్యులర్ ఉన్నప్పటికి డీఎం ఖాతరు చేయడం లేదన్నారు. నాయక్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామన్నారు.

మైనార్టీలకు సీఎం జగన్ అండ



పథకాలను వివరిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారని మేయర్ మహ్మద్ వసీం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం స్థానిక పాతూరులోని మీనా మసీదు సమీపంలో ప్రచారం చేపట్టారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు కరపత్రాలు పంచారు. గత ప్రభుత్వాలు మైనార్టీలను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే చూసేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అనేక పదవులనిచ్చి గౌరవిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, ఇషాక్, నాయకులు తిరుపాల్ రెడ్డి, గుల్జార్‌పేట ఖాజా,కేఎం బాషా, మాదార్‌వలి, తానీషా, జావీద్, హబీబుల్లా, రఫీ, షేక్షావలి, దాదా ఖలందర్, ఆసీఫ్, లల్లు, నదీం పాల్గొన్నారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

రాప్తాడు: నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాల్సిందేనని రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు చెప్పారు. బుధవారం రాప్తాడులో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమావళి, కోడ్ అమలు తదితర అంశాలపై ఆరు మండలాల అధికారులు, రాజకీయ పార్టీలతో సమీక్షించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ సూచించిన నియమావళిపై పూర్తి అవగాహన కల్పించుకుని ప్రచారాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు ప్రతి అనుమతిని సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ర్యాలీలు, రోడ్ షోలకు వారం రోజుల ముందే ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలన్నారు.

మట్కాబీటర్ అరెస్ట్

అనంతపురం: నగరంలోని సాయినగర్ 8వ క్రాస్‌లో మట్కా బీటర్ ఏ.రాజేష్‌ను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. అతడి నుంచి రూ.10,400 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆకులేడుకు చెందిన ఎల్లూరు సంజీవయ్య నుంచి 9 లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

పరామర్శ

అనంతపురం కార్పొరేషన్: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం సహాయ కార్యదర్శి షేక్ మునీరాను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బుధవారం పరామర్శించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కనగానపల్లి: ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. చంద్రాచర్ల లో బుధవారం పర్యటించిన ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బండి ఆదెప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి కూడా పరిహారం అందేలా చూస్తామన్నారు. ఇక ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగభూషణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ పాల్గొన్నారు.

సీసీసీలో ఓ అధికారి హల్‌చల్!

- ఆందోళనలో సిబ్బంది



కలెక్టరేట్‌లోని జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్‌లోని జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో (సీసీసీ) పనిచేస్తున్న ఉద్యోగులకు సహకరించేందుకు నియమించిన ఓ అధికారి హల్‌చల్ చేస్తుండడం వివాదస్పదమవుతోంది. తన చర్యలతో సిబ్బందిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయన తీరుతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. వాస్తవానికి మరో నెల రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్న రెవెన్యూ శాఖలోని ఓ అధికారిని ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదు. అయితే ఆయన ఉద్యోగానుభవాన్ని పరిగణలోకి తీసుకుని ఎన్నికల నిర్వహణలో సహాయకంగా ఉంచుకున్నారు. ఈ క్రమంలో జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అవసరమైన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించాల్సి ఉంది. తన అనుభవం రీత్యా సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చి సజావుగా పని జరిగేలా చూడాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఆయన అక్కడి సిబ్బందిపై పెత్తనం చెలాయిస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులు పంపించే క్రమంలో సహజంగానే వారిలో కొంత ఒత్తిడి నెలకొని ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రతి యూనిట్‌కు ఓ నోడల్ అధికారి ఉన్నారు. యూనిట్ పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు మొత్తం ఆ నోడల్ అధికారి చూసుకుంటారు. అయితే నోడల్ అధికారుల విధుల్లో సైతం ఆ అధికారి జోక్యం చేసుకుంటూ తన దర్పాన్ని సిబ్బందిపై ప్రదర్శిస్తూ మరింత ఒత్తిడికి గురిచేస్తున్నట్లు తెలిసింది. ఎవరైనా తన మాట వినకపోతే ఉన్నతాధికారులకు ఎక్కడ ఫిర్యాదు చేస్తారోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తమను మానసిక ఒత్తిడి లేకుండా విధులు నిర్వర్తించే వాతావరణం కల్పించాలని కోరుతున్నారు.

నగదు రహిత ఆర్థిక వ్యవస్థతో పారదర్శకత



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ హుస్సేన్ రెడ్డి

అనంతపురం: నగదు రహిత ఆర్థిక వ్యవస్థతతో పారదర్శకత పెంపొందుతుంది. తద్వారా నల్లధనాన్ని అరికట్టడానికి వీలు కలుగుతుందని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి అన్నారు. ఎస్కేయూ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో డిజిటల్ చెల్లింపు పద్ధతులు–నగదు రహిత ఆర్థిక వ్యవస్థ, పోకడలు–అంశాలు, సవాళ్లు' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. వీసీ మాట్లాడుతూ.. డిజిటల్ చెల్లింపుల ఆధునీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతమైన సదుపాయాలు కల్పిస్తున్నాయన్నారు. ప్రధాన వక్త ప్రొఫెసర్ రాజనాల్కర్ లక్ష్మణ్ (గుల్బార్గా వర్సిటీ) డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, వాటి ప్రయోజనాలు, భవిష్యత్తులో డిజిటల్ చెల్లింపుల విధానం తీరుతెన్నుల తదితర అంశాలను వివరించారు. ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ హరిచంద్ర రామా, ప్రొఫెసర్ నారాయణప్ప (బెంగళూర్ వర్సిటీ), శివరామ ప్రసాద్ (నాగార్జున వర్సిటీ) ముఖ్య వక్తలుగా మాట్లాడారు. సదస్సు కన్వీనర్‌గా ప్రొఫెసర్ డి.ఆంజనేయులు, కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దిలేటి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి అధ్యక్షతన సదస్సు జరిగింది.